


గిరిజన విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. పాఠశాలలో అందుబాటులో ఉన్న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో హెచ్ఎం మంజు వెంటనే తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్యం గానే ఉన్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి తెలిపారు. అయితే విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానికి కారణాలు తెలియరాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇప్పటికిప్పుడు పక్కా షెడ్లు సాధ్యమా?

- పేరుకే రాష్ట్ర జాతర
- పైసా విదల్చని ప్రభుత్వం
- ఇదీ పోలమాంబ ఆలయ పరిస్థితి

ప్రజాశక్తి - మక్కువ

పేరు గొప్ప ఊరు దెబ్బ అన్న రీతిగా పోలమాంబ అమ్మవారు జాతర నిర్వహణ తీరుపై జరిగిన సమీక్ష తేటతెల్లమవుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రతి ఏటా జాతరకు ముందు సమీక్షలే తప్ప ఆలయాల అభివృద్ధిపై అటు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిధులు రాక పనులు చేపట్టకపోవడంతో సమీక్షలో దిగువ స్థాయి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేయడం పట్ల పలువురు ఆక్షేపిస్తున్నారు. ధూంధాం అన్నంతమాత్రాన ఇప్పట్లో జరిగే పనులేనా? అన్న ప్రశ్న సామాన్యుల మదిలో నుంచి ఉత్పన్నమవుతోంది. చదురు గుడి ప్రాంగణంలో శనివారం శంబర జాతరపై జరిగిన సమీక్షలో అలా, ఇలా పనులు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే తప్ప నిధుల పరిస్థితిపై చర్చే లేదు. రాష్ట్ర జాతరగా అవతరించి మూడేళ్లు కావస్తున్నా పోలమాంబ ఆలయానికి నిర్వహణకు గానూ ప్రభుత్వం నుంచి ప్రతి ఏటా రావాల్సిన రూ.50 లక్షలపై ఏ ఒక్కరూ చర్చించలేదు. ఇదిలా ఉండగా కోటి రూపాయలు ఎఫ్‌డిఆర్ నిధుల నుంచి కొంత మొత్తం సమీకరించి వెంటనే పక్కా షెడ్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆలయ ఇఒ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అయితే ఆ నిధు ఖర్చు చేసే అధికారం ఎవరికీ లేదు. సంబంధిత మంత్రి, కమిషనర్ అనుమతులు ఉండాలి. దేవాదాయ శాఖ పరిధిలో ప్రభుత్వ పర్యవేక్షణలో జరగాల్సి ఉన్నప్పటికీ దీనికి ఎక్కువ సమయం పడుతుంది. ఈ అంశం మంత్రికి తెలిసినా నిధులు సేకరించమనడం పట్ల స్థానికులు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. మరోవైపు జాతర సమీపిస్తున్నప్పటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన ఖర్చులకు సంబంధించి ప్రతిఏటా ఆ శాఖ అధికారులే మల్లాగుల్లాలు పడాల్సిన దుస్థితి. ముందస్తు ఖర్చులుగా దేవాదాయశాఖ నుంచి గానీ, ప్రభుత్వం నుంచి గానీ ఎటువంటి ఓవర్ డ్రాఫ్ట్ నిధులు విడుదల కాని పరిస్థితి ఏటా నెలకొంటూనే ఉంది. ఈ ఏడాది కొత్తగా ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు కావడంతో కొంత అధికారులపై భారం తప్పే ఆస్కారం ఉంది. జాతర నిర్వహణలో ప్రతి ఏటా అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజల సమన్వయంతో మంచిగానే జాతర సాగుతోంది. కోట్లాది రూపాయలు ఆదాయం అందించే అమ్మవారు చాలావరకు ఖర్చుల రూపంలో పోవడం బాధాకరమని, ఖర్చులు తగ్గించుకోవాలన్న మంత్రి సంధ్యారాణి మాటలు ప్రజల్లోకి మంచి సమాచారమే వెళ్లిందని చర్చ జరుగుతోంది. ఆదాయంలో మిగులు కలిగేందుకు అవసరమైన పక్కా నిర్మాణాలు, అనవసరమైన ఖర్చులు తగ్గించుకోవాలని, నిధులైతే సమీకరించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడు తున్నారు. ఆ దిశగా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ప్రయత్నాలు సాగించి పోలమాంబ అమ్మవారి జాతర మరింత ఘనంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



సమీక్షలో మంత్రికి వివరిస్తున్న ఇఒ శ్రీనివాస్ (ఫైల్)


విద్యార్థుల ఆకలి కేకలు

- మధ్యాహ్నం 3గంటల వరకూ అందని భోజనం
- గ్యాస్ రెగ్యులేటర్ పనిచేయలేదని చెబుతున్న పాఠశాల సిబ్బంది

ప్రజాశక్తి - భామిని

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి, మంచి విద్యా అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తున్నా క్షేత్ర స్థాయిలో సేవలు అందించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఇటువంటి సంఘటనే ఆదివారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో చోటు చేసుకుంది. ఈ గురుకులంలో 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట అయినా గ్యాస్ వెలగని పరిస్థితి. మధ్యాహ్నం 3 గంటలైనా విద్యార్థులు భోజనం అందించలేదు. భోజనం కోసం వసతి గృహంలో ప్లేట్లుతో పడి గాపులు కాయల్సిన పరిస్థితి. ఏమిటని ప్రశ్నిస్తే గ్యాస్ రెగ్యులేటర్ సమస్యని ప్రిన్సిపల్ సమాధానం తెలిపారు. చిన్న రెగ్యులేటర్ కోసం పిల్లలు భోజనం మధ్యాహ్నం 3 గంటల వరకు భోజనం అందించకుండా ఉండడమేమిటని ఆదివారం తమ పిల్లలను చూడ్డానికి వచ్చిన తల్లిదండ్రులు అవక్కాయ్యారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 4గంటలకు వంటలు ప్రారంభించి భోజనం అందించారు.

ఇదిలా ఉండగా ప్రతి రోజూ చాలీచాలని ఆహారం, టిఫిన్‌తో సరిపెడుతున్నారని, రుచీ పచీలేని కూరలతో సరిపెడుతున్నారని, విద్యార్థులు తెలిపారు. ఎవరికి చెప్పినా ఇక్కడ పరిస్థితులు మారడం లేదని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పిల్లలకు చదువుతో పాటు, నాణ్యమైన భోజనం అందేలా చూడాలని విద్యార్థులు తల్లితండ్రులు కోరుతున్నారు.



భోజనం కోసం డైనింగ్ హాల్‌లో నిరీక్షిస్తున్న విద్యార్థులు



వంటగదిలో చిందర వందరగా పడి ఉన్న సామగ్రి


మున్సిపల్ కార్యాలయ వద్ద ఉన్న మరమ్మతులకు గురైన వాహనాలు

మరమ్మతుల పేరిట మాయాజాలం

- వాహనాల రిపేర్ల పేరిట లక్షల రూపాయలు స్వాహా
- అవగాహన లేని పాలకవర్గం
- పట్టించుకోని మున్సిపాలిటీ
- ఇదీ గ్రేడ్-1 పార్వతీపురం పురపాలక సంస్థ పరిస్థితి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక మున్సిపాల్టీలో కాలం చెల్లిన వాహనాలు సంబంధిత అధికారులకు కాసులు కురుపిస్తున్నాయి. వీటి మరమ్మతుల పేరిట లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇష్టారాజ్యంగా సిబిల్లులు పెట్టుకొని సొమ్ము చేసుకుంటున్నారు. మున్సిపాల్టీలపై పాలకవర్గానికి అవగాహన లేకపోవడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే కూడా పురపాలనను పట్టించుకోకపోవడం అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది.

స్థానిక మున్సిపాల్టీలో గత ఏడాది వాహనాల మరమ్మతులకు ఖర్చు రూ.5లక్షలు లోపు ఖర్చుయింది. ఏడాది కాకముందే మరో రూ.12లక్షలు మరమ్మతులకు ఖర్చు చేస్తోన్నట్టు తెలుస్తోంది. ఇలా ఎప్పటికప్పుడు మరమ్మతుల పేరిట అధికారులు ప్రజాసొమ్మును కాజేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రెగ్యులర్ కమిషనర్‌గా సిహెచ్ వెంకటేశ్వర్లు రాక మునుపు మున్సిపల్ వాహనాలకు ప్రతి నెలా రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు వరకు ఆయిల్ బిల్లు చెల్లింపులు అడ్డగోలుగా జరిగేవి. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దృష్టికి రావడంతో, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అప్పటి కమిషనర్ వెంకటేశ్వర్లు ఆయిల్ బిల్లు తగ్గింపునకు పగడ్బందీగా చర్యలు తీసుకోవడంతో ప్రతి నెలా వాహనాల ఆయిల్ బిల్లు రూ.2 లక్షల్లోపే చెల్లింపు జరుగుతోంది. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ కమిషనర్ వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్ళిపోవడంతో ఇన్చార్జ్, ఎఫ్ఎసి కమిషనర్ల హయాంలో వాహనాల మరమ్మతుల పేరిట ప్రతి నెలా లక్ష రూపాయలు దాటి బిల్లులు పెట్టి చెల్లింపులు జరగడం విశేషం. ఇక మరమ్మతుకు షోరూంనకు వాహనం పంపితే చాలు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల్లోపు బిల్లులు పెట్టేవారు. గత ఏడాది మున్సిపల్ వాహనాల మరమ్మతులకు రూ.5లక్షలు లోపే బిల్లులు చెల్లింపు జరిగినప్పటికీ ఈ ఏడాది ఇంకా పూర్తికాకుండానే వాహనాల మరమ్మతులకు సుమారు రూ.12లక్షలు బిల్లులు పెట్టినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నప్పటికీ, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కానీ, స్థానిక ఎమ్మెల్యే కానీ పట్టించుకోకపోవడంతో సంబంధిత అధికారులు బరితెగించి వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రజలతో పాటు కార్యాలయంలోని ఉన్న పలు విభాగాల సిబ్బంది కోరుతున్నారు.

గ్రామస్థాయి నుంచి బలోపేతం

జనసేన ఎమ్మెల్యేలతో నాగబాబు

ప్రజాశక్తి - లావేరు (శ్రీకాకుళం జిల్లా)

జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును అన్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆదివారం నాగబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యేలతో ఆయన భేటీ అయ్యారు. క్రియాశీలక సభ్యత్వ నమోదును ఉద్యమంలా కొనసాగించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ ఆశయాలు, ఉద్దేశాలు ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, లోకం నాగమాధవి, నిమ్మక జయకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'మీ కోసం'లో పిజిఆర్ఎస్ అర్జీల నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అర్జీల వివరాలు మీ కోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని కార్యాలయాల్లో ప్రజా సమస్యలు సోమవారం స్వీకరించబడతాయన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు సెల్లార్ లో ప్రత్యేకంగా సెల్ ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

అశోక్ గజపతిరాజును కలిసిన చిరంజీవులు

ప్రజాశక్తి - పార్వతీపురం

గోవా గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతి రాజును మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయనగరంలోని క్షత్రియ పరిషత్ ఆధ్వర్యాన అశోక్ గజపతిరాజుకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయనకు పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు మాజీ ఎమ్మెల్యే చిరంజీవులును యోగక్షేమాలు, పార్టీ స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు.



అశోక్‌కు పూలమొక్కలను అందజేస్తున్న చిరంజీవులు


పొలం గట్లు మీదుగా రేషన్ తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

రేషన్ కోసం గిరిజనుల పాట్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి నెలా రేషన్ కోసం పాట్లు తప్పడం లేదని మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధిలో గల పెద్దూరు గిరిజన గ్రామానికి చెందిన ఆరిక సంపంగి, జయమ్మ, బాపమ్మ, నిమ్మక సోమమ్మ, సరోజిని తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా గ్రామానికి వచ్చి వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేవారిని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాహనాలకు స్వస్తి పలకడంతో రేషన్ కోసం ప్రతి నెలా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న దశమంతపురానికి పొలం గట్లు, తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ దాటి ఆ గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు మోసుకొని రావాల్సిన పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. గ్రామంలో సబ్ డిపో ఏర్పాటు చేయాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేక పోయిందని, దీంతో పనులు మానుకొని 15కిలోమీటర్లు దూరం వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో పాటు వ్యయ ప్రయాసలకు గురువుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తమ గ్రామంలో సబ్‌డిపో ఏర్పాటు చేసి రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ఏనుగుల గుంపు హల్‌చల్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని సీతంపేట సమీపాన పంట పొలాల్లో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు హల్చల్ చేయడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అటవీ ప్రాంతాల నుంచి పొలాల్లోకి ప్రవేశించిన ఏనుగులు రైతులు సాగు చేస్తున్న పంటలతో పాటు మోటార్ పైపులను ధ్వంసం చేశాయి. ఈ ఘటనలో చేతికి అందుకొచ్చిన సుమారు వంద టన్నుల చెరుకు పంటను పూర్తిగా నాశనం చేశాయని సీతంపేటకు చెందిన రైతు చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క రాత్రిలోనే భారీగా నష్టం వాటిల్లడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యాడు. ఏనుగుల గుంపు సంచారం కొనసాగుతుండటంతో సమీప గ్రామాల రైతులు, ప్రజలు భయాందోళనతో ఉన్నారు. ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించేందుకు అటవీశాఖ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వం తక్షణమే నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


ఏనుగులు ధ్వంసం చేసిన పైపును చూపుతున్న రైతు

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం గుమడ సంతలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ కార్మిక హక్కులను హరించేలా నూతనంగా లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర భారం మోపాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపర్చడంతో సామాన్యులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు కూడా లేకుండా చేస్తున్నారని అన్నారు. ఇది చాలా అన్యాయమని, ఇలాంటి సందర్భంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెట్టేందుకు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు అని అన్నారు. అలాంటి సిఐటియు అఖిలభారత మహాసభలు మొట్టమొదటిసారి విశాఖలో జరుగుతున్నాయని, ఈ మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు హెచ్.లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాము, భవన కార్మికుల సంఘం నాయకులు వెంకట్రావు, రైతు సంఘం నాయకులు సింహాచలం, ఐద్వా నాయకులు అన్నపూర్ణ, ఆటో కార్మికులు ప్రసాద్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరుగు సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ పిలుపునిచ్చారు. మండలంలోని గరుగుబిల్లి, పెదగుడబలో సిఐటియు జెండాలను ఆవిష్కరించి అఖిల భారత సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహిం చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దాసరి వెంకటనాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ గౌరమ్మ, ఎం సావిత్రి, స్వాతి, కష్ణవేణి, గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ నాయకులు బి.గౌరి, సిహెచ్ మోహన్‌రావు, విఆర్ఎల సంఘం నాయకులు సిహెచ్ గోపాల్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.


గరుగుబిల్లిలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు రమణ



గుమడ సంతలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

దేవుడి భూముల ఆక్రమణలపై చర్యలు

- టైటిల్ వివాదంలో 686 ఎకరాలు
- ఆక్రమణలో ఉన్న భూములు 2,453ఎకరాలు
- 'ప్రజాశక్తి'తో దేవాదాయశాఖ జిల్లా అధికారి

ఎస్.రాజారావు ముఖాముఖి

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలో ఉన్న పలు ఆలయాలకు చెందిన భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నామని జిల్లా దేవాదాయశాఖ అధికారి ఎస్.రాజారావు చెప్పారు. జిల్లాలోని దేవాలయాలు, భూముల ద్వారా వస్తున్న ఆదాయం, ధూపదీప నైవేద్యాలు, టిటిడి ఆధ్వర్యాన చేపడుతున్న భోజన మందిరాల నిర్మాణం గురించి ప్రజాశక్తితో ఆయన ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

జిల్లాలో దేవాదాయశాఖ పరిధిలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయి? వాటి పరిధిలోని భూమి ఎంత?

దేవాదాయ శాఖ పరిధిలో మన్యం జిల్లాలో ఉన్న దేవాలయాలు 179. వీటి పరిధిలో 9848.01 ఎకరాలు ఉన్నాయి. ఇందులో 1762.66 ఎకరాల పల్లం, 1288.72 ఎకరాల మెట్ట ఉంది. అడవులు, కొండలకు సంబంధించి 488 ఎకరాలు వున్నాయి. ఇతర రకాల భూములు 5641.7ఎకరాలు ఉన్నాయి. దేవాలయాలున్న పరిసర ప్రాంతాల పరిధి 11,127.4 చదరపు గజాలు ఉంది.

ఆక్రమణ ల్లో ఉన్న దేవాదాయ భూములెన్ని? తొలగించడానికి చేపడుతున్న చర్యలు ఏమిటి?

జిల్లాలో 2453.64 ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నాయి. టైటిల్ వివాదంలో 686.89 ఎకరాల భూములు ఉన్నాయి. ఆక్రమణల్లో గల భూములకు సంబంధించి కొన్ని కోర్టు కేసులు నడుస్తున్నాయి. ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో ఈ కేసులున్నాయి. సాలూరు మండలంలోని పారమ్మకొండ, మాన్సాస్ ట్రస్ట్‌కు చెందిన భూములు వివాదంలో వున్నాయి.

వ్యవసాయ యోగ్యమైన భూమి ఎంత? ఏటా ఆదాయం ఎంత?

దేవాలయాలకు సంబంధించి వ్యవసాయ యోగ్యమైన భూమి 3051.42 ఎకరాలు. లీజుకు ఇచ్చిన భూములు 587.23ఎకరాలు. వీటి ద్వారా ఏటా రూ.17లక్షల 35వేల 942 ఆదాయం లభిస్తోంది. ఆక్రమణల్లో ఉన్న భూముల ద్వారా రైతులు నామమాత్రపు రుసుం చెల్లిస్తున్నారు.



టిటిడి ద్వారా జిల్లాకు మంజూరైన దేవాలయాలెన్ని?ఎన్ని పూర్తయ్యాయి?

తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా జిల్లాలో 158 దేవాలయాలు మంజూరయ్యాయి. నాలుగు దశల్లో ఇవి మంజూరయ్యాయి. మొదటి విడతలో 100 దేవాలయాలు, రెండో విడతలో 5, మూడో విడత 34, నాలుగో విడతలో 19 దేవాలయాలు మంజూరయ్యాయి. వీటిలో కేవలం పది దేవాలయాల నిర్మాణం పూర్తయింది. పునాదుల స్థాయిలో 76దేవాలయాలు వున్నాయి. 38 దేవాలయాల నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వడం జరిగింది.

ధూపదీప నైవేద్యాలు అమలవుతున్న దేవాలయాలు ఎన్ని? అర్చకులు ఎంతమంది ఉన్నారు?

జిల్లాలో దేవాదాయశాఖ పరిధిలో ధూపదీప నైవేద్యాలు అమలవుతున్న దేవాలయాలు 207. వీటిలో 208మంది అర్చకులు ఉన్నారు. ఒక్కో అర్చకుడికి నెలకు రూ.10వేలు వేతనం చెల్లిస్తున్నాం. 21మంది అర్చకులకు ఎఆర్ఎఫ్ ద్వారా రూ.2లక్షల 65వేల 175 చెల్లిస్తున్నాం.



టిటిడి ద్వారా భజన మందిరాల నిర్మాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?నిర్మాణ వ్యయం ఎంత?

జిల్లాలో టిడిపి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా భజన మందిరాల నిర్మాణానికి దరఖాస్తులు కోరాం. ఇంతవరకు 91 దరఖాస్తులు అందాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో మందిరాల నిర్మాణానికి దరఖాస్తులు కోరాం. ఆలయాల్లేని కాలనీల్లో మందిరాల నిర్మాణానికి చర్యలు చేపడతాం. మూడు కేటగిరీల్లో మందిరాల నిర్మాణం జరగనుంది. ఐదు సెంట్ల స్థలంలో రూ.పదిలక్షలు, పది సెంట్ల స్థలంలో రూ.15లక్షలు, 20 సెంట్ల స్థలంలో రూ.20లక్షల వ్యయంతో భజన మందిరాల నిర్మాణం జరగనుంది.

జిల్లాలో ఎన్ని దేవాలయాలకు ట్రస్ట్ బోర్డుల నియామకం జరిగింది?

జిల్లాలో 13 దేవాలయాలకు ట్రస్ట్ బోర్డుల నియామకం జరగాల్సి వుంది. అయితే పాలకొండ కోటదుర్గ, మక్కువ మండలం శంబర పోలమాంబ, సాలూరులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలకు ట్రస్ట్ బోర్డుల నియామకం జరిగింది.

ఏజెన్సీలో విజృంభిస్తున్న గాలికుంటు వ్యాధి

- ఆందోళన చెందుతున్న పాడి రైతులు
- వేధిస్తున్న పశు వైద్యుల కొరత

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో గత 15 రోజులుగా పశువులను గాలి కుంటివ్యాధి (సంచలు) పట్టిపీడిస్తుంది. మన్యంలో ఈ వ్యాధి విజృంభిస్తుండడంతో పాడి రైతులు ఆందోళన చెందు తున్నారు. ఇప్పటికే మండలంలోని సీతంపేట, సోమగండి, పనుకువలస, పులిపుట్టి, గుమ్మడ తదితర గ్రామాల్లో ఈ వ్యాధి చాప కింద నీరులా వ్యాప్తి చెందడంతో రైతులు ఆందోళన చెందతున్నారు. ఈ గాలికుంటువ్యాధిని గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది రైతులు సంచల వ్యాధి అని కూడా పిలుస్తారు. అమ్మవారు అని ధూపాలు, వేప కొమ్మలు, గుగ్గిలం దూపాలు కూడా వేస్తారు. అయితే ఇప్పటికే గిరిజన గ్రామాల్లో గాలికుంటి వ్యాధి వైరస్ పంజా విసరుడంతో సీతంపేటలో పాడిగేదెలు మృతి చెందాయని రైతులు చెబుతున్నారు. టీకా వేసినప్పటికీ ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తునే పశువైద్య అధికారులు టీకాలు వేశారు. అయితే కొంతమంది ఈ టీకాలు వేస్తే పాల దిగుబడి తగ్గిపోతుందని వేయించుకోలేదని చెప్పుకొస్తున్నారు. మండలంలో ఆవు, ఎద్దులు 13,063, గేదెలు, దున్నలు 1,872, మేకలు 1,553, గొర్రెలు 6,251ఉన్నట్టు అధికారిక గణంకాలు చెబుతున్నాయి. అయితే ఇంత కన్నా ఎక్కువ ఉండే అవకాశం ఉంది. ఈ వైరస్ కలుషితమైన గాలి ద్వారా వస్తుంది. తల్లి పాల ద్వారా దూడలకు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో విరివిగా గేదెలు, ఎద్దులు, ఆవులకు ఈ గాలికుంటు వ్యాధి సోకుతుంది. ప్రతి జీవికి ఈ వైరస్ సోకుతుంది. ఈ వ్యాధి సోకిన సమయంలో పశువులకు 104 నుంచి 105 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. నోటిలోను, గిట్ల మధ్య పుండ్లు పుడతాయి. వీటిని క్రిమిసంహారిక మందులతో శుభ్రం చేయాలి. పశువులు నడవలేని స్థితికి చేరుతాయి. ఎక్కువగా మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్‌లో ఈ వ్యాధి పశువులకు వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పశువుకు నోటిలో గిట్ల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. మూడు, నాలుగు


వ్యాధుల బారినపడ్డ మేకలు


గాలికుంటు వ్యాధితో మృతి చెందిన గేదె

వారాలు బొబ్బలు పగిలి పుండ్లుగా మారుతాయి. చర్మం గరుకుగా మారుతుంది. నోటు చిగుళ్లపై పొక్కులు ఏర్పడతాయి. పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో నేలలు చెత్తడిగా ఉండడం వల్ల గాలి కుంటివ్యాధి వస్తుంది. పాడి గేదెల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఎద్దుల్లో అయితే రోగ నిరోధక శక్తి తగ్గిపోయి తొందరగా అలసటకు గురై నీరసించిపోతాయి. టీకాలు వేయడం వల్ల పశువులకు రోగ నిరోధ శక్తి కలిగి ఉంటాయి. సూడి పశువులకు గాలి కుంటివ్యాధి సోకితే పిండం పడిపోయే అవకాశం ఉంది. అలాగే చూడు పోయే అవకాశం కూడా ఉంటుంది. దీని లక్షణాలను గుర్తించి రైతులు వైద్యాధికారులతో సంప్రదించే జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదమే.

వేధిస్తున్న వైద్యుల కొరత

మండలంలో సీతంపేటలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎడి కార్యాలయం ఉన్నప్పటికీ తెర్లాం మండలానికి చెందిన ఎడి శ్రీనివాసరావు తెర్లాంలో మూడు రోజులు సీతంపేటలో మూడు రోజులు ఇన్చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. సీతానగరం మండలం నిడగల్లు పశు వైద్యాధికారి ఈ రెండు మండలాలకు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది వైద్యులు ఏ మేరకు ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

అన్ని గ్రామాల్లో టీకాలు వేశాం

గాలి కుంటి వ్యాధి వైరస్‌కు గిరిజన గ్రామాల్లో టీకాలు వేయించాం. పాల దిగుబడి తగ్గుతాయని వేయించక పోతే గాలి కుంటి వ్యాధి రావచ్చు. అయితే వెంటనే వైద్య సేవలు అందిస్తున్నాం మందులు అన్ని పూర్తిస్థాయిలో ఉన్నాయి.

బి.శ్రీనివాసరావు, ఎడి వెటర్నరీ, సీతంపేట మండలం.


పిడిఎస్ బియ్యంతో పట్టుబడిన లారీ

25టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పార్వతీపురం మండలం తాళ్లబురిడి రైస్ మిల్లు నుంచి 500 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని లారీలో ఒడిశాలోని జైపూర్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ 25 టన్నుల గల ఈ బియ్యం విలువ రూ.9లక్షల 50వేలు ఉంటుందని అధికారుల అంచనా. బియ్యం లోడుతో ఉన్న లారీని సీజ్ చేసి, డ్రైవర్‌పై, మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం సిఎస్‌డిటి జి.హేమలతకు సీజ్ చేసిన బియ్యాన్ని అప్పగించారు.

ద్విచక్ర వాహనాలు వేలం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నాటు సారా రవాణాకు ఉపయోగించి పలు నేరాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడి, కేసు నమోదైన ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్టు నిర్వహించేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిఐ ఎస్ శిరీష ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ ఉన్నతాధికారులు సోమవారం ఉదయం 11 గంటలకు నిర్ణయించారని, ఆసక్తి గలవారు పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జరుగు వేలం పాటకు హాజరై ఈ అవకాశాన్ని వేలం పాటదారులు వినియోగించుకోవాలని కోరారు.

మట్టి లారీ పట్టివేత

ప్రజాశక్తి -పాలకొండ

పాలకొండ పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి కంకర మట్టితో తరలిస్తున్న లారీని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ పట్టుకొని సీజ్ చేశారు. ఎటువంటి అనుమతుల్లేకుండా ఇసుక, కంకర మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో సహించేది లేదన్నారు.


మాజీ మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న జెడ్‌పిటిసి సుజాత

'వైసిపి బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - కురుపాం

వైసిపి మన్యం జిల్లా ఉపాధ్యక్షులుగా కురుపాం జెడ్‌పిటిసి జి.సుజాత నియమితులైన సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆమె మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణిని ఆదివారం సాయంత్రం చినమేరంగిలో గల తన అతిథి గృహంలో కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుశర్ల పరీక్షిత్ రాజు, అలాగే మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, తూచా తప్పకుండా వారి సూచనలు, సలహాలు పాటిస్తూ జిల్లాలో వైసిపి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కార్యకర్తల సమన్వయం, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా తీసుకెళ్లడమే తన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జల విహార్ వద్ద బోటు షికారు చేశారు. ఆల్ ట్రైన్ వెహికల్ చుట్టుముట్టారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో విహరించారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. మరి కొంతమంది సాహసోపేతమైన క్రీడ నిర్వహించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.


బస్సు షెల్టర్ లేక రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బస్ షెల్టర్ లేక ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద బస్ సెంటర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురు, శనివారాల్లో లక్ష్మీనరసింహ దేవాలయానికి ఐదు మండలాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. దీంతో ఇక్కడ ప్రయాణ సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్ వద్ద చెట్లు వద్దనే నిల్చొని పరిస్థితి వస్తుంది, అంతే కాకుండా ఫ్రీ బస్ కావడంతో మహిళలు పెద్ద ఎత్తున ఒకేసారి రావడంతో బస్సులు ఆపే పరిస్థితి లేదు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికులకు బస్ షెల్టర్‌ను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కుక్కలు బాబోయ్!

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల ఆవరణలు కుక్కలకు నిలయాలుగా ఉన్నాయి. దీంతో విధులకు వస్తున్న ఉద్యోగులపై అవి దాడులు చేసి కాటు వేస్తున్నాయి. అంతేకాకుండా మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల సంఖ్య రోజురోజుకు పెరిగిపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో ఆవు దూడలు, గొర్రెలు, కోళ్లపై దాడులు చేస్తున్నాయి. వీటితో ఆగకుండా వాహనదారులపై కూడా వెంటాడుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని అధికారులు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కొమరాడ

తనకొచ్చిన జీతం నుంచి ప్రతినెలా పేదల కోసం ఎంతో కొంత ఖర్చు చేసి సహాయం చేస్తానని పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గిరిజన గ్రామమైన కోనవలసలో 50 మంది వృద్ధులకు, మహిళలకు (రగ్గులు) దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జన్ని వెంకటరావు, మండంగి అప్పారావు, ఎం.సాంబయ్య, డి. సంధ్య, బొండపల్లి వెంకటరమణ సమక్షంలో వీటిని అందజేశారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి జంక్షన్ వద్ద సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు క్షుణంగా పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. తనిఖీల్లో ఎఎస్ఐ సంజీవ్, సిబ్బంది ఉన్నారు.

గంగాడలో అపారిశుధ్యం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గంగాడలో అపారిశుధ్యం తాండివిస్తోంది. ఈ గ్రామంలోని అన్ని వీధుల్లో గల కాలువల్లో పూడికతీతలు తీయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగునీరు కదలక వాడుక నీరు వెళ్లడానికి అవకాశం లేక చెత్త నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాక దోమలకు నిలయంగా మారింది. దీనివల్ల గ్రామస్తులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల బారిపడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా గల కాలువల్లో పూడిక తీయడం లేదన్నారు. ఇందుకు సంబంధించి గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు స్పందించి కాలువల్లో చెత్త తొలగించి కాలువలను శుభ్రం చేయించి పనులు చేపట్టిలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గంగాడలో మురుగు కాలువ

కంపుకొడుతున్న కాలువలు : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలు మాయమవుతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ ఒబిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు, నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, ఎస్సీ సెల్ చైర్మన్ కోలా కిరణ్ కుమార్, కిసాన్ మండలం అధ్యక్షులు బంకపల్లి ఉమామహేశ్వర రావు, కిసాన్ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు చొక్కాపు వెంకటరమనణ తదితరులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పట్టణ రహదారిలో రాయగడ రోడ్డు నుంచి బెలగాం వరకు ఇరువైపులా మురుగు కాలువలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. పలుచోట్ల మురుగు కాలువలు కనిపించే పరిస్థితి లేదన్నారు. పట్టణంలోని బడా వ్యాపారుల షాపుల వద్ద మురుగు కాలువలను కలిపి ఆయా షాపులకు రహదారులు నిర్మించుకున్నారన్నారు. ముఖ్యంగా పార్వతీపురంలో ఇటీవల ప్రారంభమైన సిఎంఆర్ షాపింగ్ మొదలుకొని పలు బంగారం, బట్టల షాపుల వద్ద మురుగు కాలువలు మచ్చుకైనా కనిపించడం లేదన్నారు. అలాగే పట్టణ నడిబొడ్డును ప్రవహిస్తున్న వరహాలగెడ్డపై కూడా ఎస్ఆర్‌తో పాటు కొంతమంది వ్యాపారులు తమ షాపులకు మార్గాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో అడుగడుగుకు ఒక వంతెన నిర్మించి వరహాల గెడ్డకు నామరూపాల్లేకుండా మార్చేశారన్నారు. అలాగే మోర్ వంటి కొన్ని పెద్ద షాపులకు సెల్లార్ లేకపోవడంతో వాహనాల పార్కింగ్ మెయిన్ రోడ్డుపై చేస్తుండడంతో పట్టణాన్ని నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోందన్నారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద ఆర్‌సిఎం పాఠశాల వైపు మెయిన్ రోడ్డును ఆక్రమించి కొంతమంది వ్యాపారాలు చేస్తుండడంతో నిత్యం ఆయా జంక్షన్లలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పట్టణ మెయిన్ రోడ్డులో మురుగు కాలువలు మెయిన్ రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో మురుగు కాలువల్లో మురుగు తొలగించే పరిస్థితి కానరావడం లేదన్నారు. దీనివల్ల పక్కన మెయిన్ రోడ్డు లోని మురుగు కాలువలు మురుగు కంపు కొడుతున్నాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. సామాన్యులు ఇళ్ల మరమ్మతుల కోసం ఇసుక రోడ్డుపై వేస్తే మున్సిపాలిటీ, సచివాలయం, సిబ్బంది దగ్గరుండి తొలగిస్తారని, పట్టణ మెయిన్ రోడ్డు మురుగు కాలువలను బడాబాబులు ఆక్రమిస్తే ఎందుకు కన్నెత్తి చూడరని ప్రశ్నించారు. తక్షణమే సంబంధిత శాఖలకు చెందిన ఉన్నతాధికారులు స్పందించి పట్టణ మెయిన్ రోడ్డులో మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలను, పక్కా కట్టడాలను తొలగించి పూడిక తీత పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఇష్టానుసారంగా అక్రమ మట్టి గ్రావెల్ తవ్వకాలు రోజురోజుకు పెరిగిపోతున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు మట్టిని గుట్టు చప్పుడు కాకుండా తవ్వుకుపోతున్నారు. మండల కేంద్రమైన కొమరాడ, అంటివలస సమీపాన ఆదివారం మట్టి తవ్వకాలు జోరందుకోవడంతో స్థానిక కూటమి నాయకులు మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఇష్టానుసారంగా వివిధ అవసరాల కోసం మట్టి తవ్వకాలు ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా జెసిబిలతో రాత్రీ పగలు తేడా లేకుండా గుట్టు చప్పడు కాకుండా తవ్వకాలు జరుపుతున్నారు. గత బుధవారం మట్టి తవ్వకాలు జరిపిన సమయంలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో నిలిపివేసి మళ్లీ ఆదివారం సెలవు దినం కావడంతో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. మట్టి తవ్వకాలపై స్థానికులు రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం ఎవరూ పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు జరిగినా పట్టించుకోకపోవడం ఒక విషయమైతే అంతర్రాష్ట్ర రహదారిపై నుంచి మట్టి తరలిస్తున్నా కనీసం అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. బుధవారం మట్టితవ్వకాలపై ఫిర్యాదులు చేస్తే రెవెన్యూ అధికారులు మా రెవిన్యూ కార్యాలయానికి అవసరం నిమిత్తం ఒక నాలుగు లోడ్లు వేసి మీకు నచ్చినట్లు తవ్వుకోండి అన్న విధంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆదివారం మట్టి తవ్వకాలపై తహశీల్దార్‌కు, ఆర్ఐకు, విఆర్ఒలకు, మైనింగ్ అధికారులకు స్థానికులు ఫోన్లో ఫిర్యాదు చేసినా కనీసం ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో అధికారులకు మట్టితో భారీగా ముడుపులు అందాయని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, మైనింగ్ ఉన్నతాధికారులు స్పందించి అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణను వివరణ కోరగా రెవెన్యూ అధికారులను పంపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మట్టితవ్వకాలపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ప్రజా ఉద్యమ ర్యాలీకి తరలిరండి : జోగారావు

ప్రజాశక్తి - బలిజిపేట

పార్వతీపురంలో సోమవారం చేపట్టనున్న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం బలిజిపేటలో వైసిపి మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లా ప్రజలు నుంచి సేకరించిన లక్షలాది సంతకాల ప్రతులను ప్రత్యేక వాహనం ద్వారా ప్రజా ఉద్యమ ర్యాలీగా రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించే ప్రజా ఉద్యమం కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం పార్వతీపురంలో వైఎస్ఆర్ విగ్రహం కూడలి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఈ ర్యాలీలో బలిజిపేట మండలంతో పాటు నియోజకవర్గ పరిధిలో గల సీతానగరం, పార్వతీపురం అర్బన్, రూరల్ మండలాల వైఎస్‌పి అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో ఉన్న పార్టీ అనుబంధ విభాగాల కమిటీ అధ్యక్షులు, మండల పార్టీ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజలు, యువత, విద్యార్థులంతా కలిసి పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయనతో పాటు మండల వైసిపి అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జడ్పీటీసీ అలజంగి రవికుమార్, వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురంలో మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ ఐటిఐ, పిజి కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. గరుగుబిల్లిలో జూనియర్ కళాశాల, కురుపాంలో డిగ్రీ కళాశాల, గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్వతీపురంలో గిరిజన విద్యార్థుల కోసం అదనంగా కళాశాల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కురుపాంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం పనులు పూర్తి చేయాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు జరిపి కురుపాంలో తరగతులు నిర్వహించాలని కోరారు. పాచిపెంటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు నూతన భవనం నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కురుపాంలో గిరిజన బాలికల కళాశాల వసతి గృహానికి సొంత భవనాలు నిర్మించాలన్నారు. సాలూరు ప్రభుత్వ ఐటిఐకి సొంత భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. పాచిపెంట మండలంలోని కొటికిపెంట "ఏకలవ్య"పాఠశాల భవనం నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలన్నారు. కొమరాడ గిరిజన బాలుర గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. పాచిపెంట, మక్కువ, కొమరాడ, బలిజిపేట మండల కేంద్రాల్లో కళాశాల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వినియోగంలో లేని మరుగుదొడ్లు

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు కనీసం నిలబడ్డానికి ప్లాట్‌ఫారం కూడా లేదు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో చెత్తాచెదారాలు నిల్వ ఉండి, దుర్వాసన ఉన్నందున ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. దీనివల్ల సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, కలరా, డెంగీ ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దీంతో అక్కడ విశ్రాంతి తీసుకోవడానికి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బొబ్బిలి, రాజాం నుంచి బస్సుల్లో పాఠశాలు, కళాశాల విద్యార్థులు, అధికారులు ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీగా ఉన్నందున ఆ సమయంలో బస్సుల కోసం ఆ దుర్వాసనలోనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పకైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రయాణికులకు తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బస్టాండ్‌లో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంపు దారుణం

విజయనగరం టౌన్ : కేంద్ర మంత్రివర్గం బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని వంద శాతానికి పెంచడం, బీమా చట్టాల సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దారుణమని ఐసిఇయు కార్యదర్శి ఎం.వి.శరత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రస్తుతం బీమా రంగంలో ఉపయోగి స్తున్న మొత్తం మూలధనంలో విదేశీ పెట్టుబడుల వాటా కేవలం సుమారు 32 శాతమేనని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎఫ్‌డిఐ పరిమితిని 100 శాతానికి పెంచడం, విదేశీ మూలధనానికి పూర్తిస్థాయి స్వేచ్ఛ ఇవ్వడం పూర్తిగా అవివేకమైన చర్యని అభిప్రాయ పడ్డారు. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాకుండా, దేశీయ బీమా సంస్థలకు కూడా తీవ్రమైన దుష్పరిణామాలను తీసుకువస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం లోని బలహీన వర్గాల ప్రయోజ నాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొ న్నారు. దేశీయ పొదుపు లకు విదేశీ మూలధనం ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదని తేల్చిచెప్పారు. బీమా రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని పెంచే నిర్ణయానికి తీవ్రంగా వ్యతిరేకి స్తున్నామని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.


విద్యుత్‌కాంతులతో ముస్తాబైన వీరఘట్టంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి

క్రిస్మస్‌కు ముస్తాబవుతున్న చర్చిలు

ప్రజాశక్తి - వీరఘట్టం

రానున్న క్రిస్మస్‌కు మండలంలోని పలు చర్చిలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ఇందులో భాగంగా వీరఘట్టంలోని తెలుగు బాప్టిస్ట్ దేవాలయంతో పాటు నడుకూరు, తూడి, తలవరం, వండువ, బిటివాడ, తెట్టంగి తదితర గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు నిర్వాహకులు రంగులు దిద్ది, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి అలంకరణ చేస్తున్నారు. ప్రతి ఏటా క్రిస్మస్ శుభ సందర్భంగా దేవాలయాలకు విద్యుత్తు అలంకరణలు చేయడం ఆనవాయితీగా వస్తుంది.

జెఎన్‌టియులో ముగిసిన హ్యాక్‌థాన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు-జివి, జెన్ ఎఐ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జెన్ ఎఐ హ్యాక్‌థాన్ ఫర్ నెక్ట్స్ జనరేషన్ జాబ్స్ అనే సాంకేతిక కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీనియర్ ప్రిన్సిపల్ ఇంజినీరింగ్ మేనేజర్ నరసింహ కారుమంచి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును ఉపయోగించి వివిధ రకాల సాంకేతికతలను నేర్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వాటిని సక్రమంగా ఉపయోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం విప్రత సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు డాక్టర్ హను యెడ్లూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఇటువంటి కార్యక్రమాల కారణంగా ప్రతి ఇంటినుంచి ఒక పారిశ్రామిక వేత్త ఉద్భవించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఒడి ఎఐఒ సాజి వి.ఎఫ్, జెఎన్‌టియు జివి రిజిస్ట్రార్ జయసుమ, ప్రిన్సిపల్ ఆర్.రాజేశ్వర రావు మాట్లాడారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా జి.జె.నాగరాజు, ఆర్.డి.డి.వి.శివరామ్ వ్యవహరించారు. కార్యక్రమంలో బృందాల వారీ పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు.